06ATP27_06ATP27.qxd 04-09-2024 PM 10:34 Page 1



## గుండెపోటుతో హోంగార్డు మృతి

- నివాళులర్పించిన డిఎస్పీ, సిఐ, ఎస్ఐలు
- అంత్యక్రియలకు రూ. 20వేలు అందజేత



మృతిచెందిన హోంగార్డు ఆంజనేయులు(ఫైల్‌ఫోటో)



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డిఎస్పీ తదితరులు

**బత్తలపల్లి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**

స్థానిక పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న నల్లపు ఆంజనేయులు బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. ముదిగుబ్బ మండలం దొరిగిల్లు గ్రామానికి చెందిన ఆజనేయులు(54) గత 30సంవత్సరాలుగా వివిధపోలీస్‌స్టేషన్‌లలో హోంగార్డుగావిధులు నిర్వర్తించాడు. మంగళవారం సైతం విధులకు హాజరై రాత్రి స్వగ్రామానకి వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున తన ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే డిఎస్పీ శ్రీనివాసులు, సిఐ ప్రభాకర్, ఎస్:ఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ సోమశేఖర్ మూర్తి, హెడ్‌కానిస్టేబుల్ గంగాధర, సిబ్బంది, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్, ఏఎస్ఐ శామీర్ తదితరులు మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంభ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం ధర్మవరం డిఎస్పీ రూ.10వేలు, హోంగార్డు అసోషియేషన్ తరపున రిజర్వ్ ఇన్స్పెక్టర్ రూ. 10వేలు అందజేశారు. మృతునికి భార్యతో పాటు కుమార్తె, కుమారుడు వున్నారు.

## తేదేపా కార్యకర్త మృతికి నివాళులు

**అగళి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని గాయత్రి కాలనీ గ్రామానికి చెందిన మారుతి అనే తెలుగుదేశం కార్యకర్త అనారోగ్యం కారణంగా మృతిచెందిన విషయం తెలుసుకున్న జడ్పిటిసి ఉమేష్ మృతుని భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మారుతి మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో రాజన్న, శ్రీనివాస్, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌పి షాపును ప్రారంభించిన జడ్పిటిసి

**అగళి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



ఎఫ్‌పి షాపును ప్రారంభిస్తున్న జడ్పిటిసి

మండల పరిధిలోని హుల్లెకెర గ్రామంలో చౌకడిపోను జడ్పిటిసి ఉమేష్ ప్రారంభించారు. ప్రభుత్వం పేదలకు నాణ్యమైన బియ్యాన్ని, ఇతర నిత్యావసర వస్తువులను అందిస్తోందని దీనిని పేదలు సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఎక్కడా లేని విధంగా పేదలకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా అప్పుడు తెల్లరేషన్‌కార్డులను అందించారని, వీటితోపాటు సంక్రాంతి కానుకలు, రంజాన్‌తోఫా, క్రిస్మస్ కానుకలు అందించి పేదల ఆకలి తీర్చారని వారు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ కానుకలను రద్దు చేశారని, దీనిని తిరిగి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదలకు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, టిడిపి నాయకులు రాజన్న, భూతరాజు, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఎరుకుల ప్రజా పోరాట సమితి కమిటీ ఏర్పాటు

**ధర్మవరం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



ధర్మవరం మండల అధ్యక్షులు గుజ్జల రఘువీర్



ధర్మవరం మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జలబాలు

పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో ఆంధ్రప్రదేశ్ ఎరికల ప్రజా పోరాట సమితి రాష్ట్రప్రధాన కార్యదర్శి గుజ్జల సురేష్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఓ పత్రిక ప్రకనలో తెలిపారు. ధర్మవరం మండల అధ్యక్షుడిగా ఇందిరమ్మ కాలనీకి చెందిన గుజ్జల రఘువీర్‌ను నియమిస్తూ తీర్మానం చేయడం జరుగుతుందని, అలాగే ధర్మవరం మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ధర్మవరం పట్టణ కేతిరెడ్డి కాలనీ వాస్తవ్యులు గుజ్జల బాలును నియామకం చేయడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ ఎరుకల ప్రజా పోరాట సమితి రాష్ట్రప్రధాన కార్యదర్శి గుజ్జల సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తమ మీద నమ్మకంతో మా ఎన్నికకు సహకరించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బిజిలి గంగులప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుజ్జల సురేష్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుజ్జల ముత్యాలమ్మలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగిందని, ఎరుకుల కులస్తులలో ఐక్యతకు కృషి, ఎరుకల హక్కుల సాధనకై రాజీలేని పోరాటాలు చేస్తామని ఈ సందర్భంగా, ధర్మవరం మండల అధ్యక్షులు గుజ్జల రఘువీర్, ధర్మవరం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జల బాలు తెలిపారు.

## ప్రభుత్వ ప్రోత్సాహకాలను మామిడి రైతులు వినియోగించుకోవాలి

- ఎంపిడిఓ అబ్దుల్ నబీ

**ధర్మవరం రూరల్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



మొక్కలు నాటడానికి గుంతలను తీస్తున్న దృశ్యం

మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా మామిడి రైతులకు ప్రోత్సాహం ప్రభుత్వం అందిస్తుందని ఈ అవకాశం ప్రతి ఒక్క రైతు వినియోగించుకోవాలని ఎంపిడిఓ అబ్దుల్ నబి తెలియజేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని మల్లా కాలువ గ్రామంలో గత రవీంద్రరెడ్డి పొలంలో గుంతలు తవ్వి, మామిడి మొక్కలను నాటడం జరిగింది. రైతులు మంచి మొక్కలను ఎంపిక చేసుకొని తవ్విన గుంతలలో ఎరువులు వేసి నింపితే మొక్కలు త్వరగా పెంపకం జరుగుతుందని తెలిపారు. మూడు సంవత్సరాలపాటు ప్రభుత్వం నుంచి ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహం కూడా లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ అనిల్‌కుమార్‌రెడ్డి, టిఏ చంద్రకళ, సీనియర్ మేట్ రవి, గ్రామ రైతులు కూలీలు పాల్గొన్నారు.

## తోలు బొమ్మల కళాకారిణికి శిల్పగురు అవార్డు..

- సన్మానం చేసిన మంత్రి సిబ్బంది

**ధర్మవరం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోట బొమ్మల కళాకారిణి దళవాయి శివమ్మకు శిల్ప గురు జాతీయ అవార్డు దక్కడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి ఆదేశాలతో కార్యాలయ సిబ్బంది నిమ్మలకుంటలోని ఆమె ఇంటికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు హరీష్, మల్లికార్జున షీల్డ్‌ను అందజేసి, జాతీయ అవార్డు రావడం సంతోషకరమని ఈ అవార్డు అందడం తోలుబొమ్మల కళాకారులకు ముఖ్యంగా రాయలసీమ కళాకారులకు గర్వకారణమని తెలిపారు. ఇలాంటి కళాకారులకు, ముఖ్యంగా రాయలసీమ కళాకారులకు గర్వకారణమని తెలిపారు. ఇలాంటి కళలను కాపాడుకునేందుకు ఆమె చేస్తున్న సేవలను అభినందిస్తూ శివమ్మ లాంటి కళాకారుల స్ఫూర్తితో యువత ప్రాచీన కళలను కాపాడుకునే చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు డి.చెర్లోపల్లి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమ నిబంధనలు ప్రజలు పాటించాలి

- నూతన ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.వెంకటరాముడు

**ధర్మవరం రూరల్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



నూతన ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.వెంకటరాముడు

ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పక ప్రజలు పాటించినప్పుడే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండవని నూతన ట్రాఫిక్ ఎస్ఐ-ఎస్.వెంకటరాముడు తెలిపారు. ఈ సందర్భంగా వారు ధర్మవరం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పదవీ బాధ్యతలను చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తాను పుట్టపర్తి మహిళా పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీగా ధర్మవరం ట్రాఫిక్ ఎస్ఐగా అటాచ్‌మెంట్‌గా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లోని ఉద్యోగుల సమన్వయంతో ట్రాఫిక్‌ను నియంత్రణ చేస్తానని తెలిపారు. సీటు బెల్టు, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, మైనర్‌లకు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించని వారందరికీ కూడా జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు. పట్టణంలో వాహనదారులు అతివేగంగా వెళ్లరాదని, బాట సారులను గమనిస్తూ, ముందు వెళ్లే వాహనాలను గమనిస్తూ, సుఖవంతమైన ప్రయాణం చేయాలని తెలిపారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు ప్రజల కొరకేనని వారు తెలిపారు. డ్రైవింగ్ చేసే ప్రతి వాహనదారుని వద్ద లైసెన్స్ వెహికల్‌కు సంబంధించిన అన్ని ఆధారాలు ఉండాలని తెలిపారు. ఇందులో భాగంగానే తాము తనిఖీ చేసే సమయంలో అవి చూపించాలని తెలిపారు. కాబట్టి ప్రజలు వాహనదారులు ట్రాఫిక్ నియంత్రించుటలో తమ సహాయ సహకారాలు అందించాలని తెలిపారు.

## స్మశాన వాటిక చూపకపోతే ప్రభుత్వ కార్యాలయాలే గతి

- సమాధులను ధ్వంసం చేసి కబ్జాలు చేస్తున్నా పట్టించుకోరా..సాకే హరి

**చెన్నేకొత్తపల్లి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



అధికారులతో మాట్లాడుతున్న జేఏసి నాయకులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జేఏసి నాయకులు సాకే హరి

దళితులు చని పోతే పూడ్చుకో వడానికి, స్మశాన వాటికలు చూపక పోతే ప్రభుత్వ కార్యాలయాలే గతి అవుతుందని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసి రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. బుధవారం చెన్నేకొత్తపల్లి మండల తహశ్శిల్దారు అనురాధని బసం పల్లి గ్రామస్తులతో కలిసి స్మశాన వాటిక కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సాకే హరి పాత్రికేయులతో మాట్లాడుతూ.. బసంపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 17/1ఏలో 80 ఏళ్లగా స్మశాన వాటిక మాలలకు ఉందని అయితే అదే గ్రామానికి చెందిన గాండ్ల కులస్తులు కొంత మంది గౌర్జన్యంగా ఆక్రమించుకొని స్మశానంలోని సమాదులను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ఇదే విషయాన్ని పోలీసు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా మాలలకు చెందిన స్మశాన వాటికకు హద్దులు చూపించి ఆన్‌లైన్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ చెరుకూరి గంగులయ్య, మానవ హక్కుల వేదిక మల్లికార్జున, మాల మహానాడు సోదనపల్లి రామాంజినేయులు, జేఏసి నాయకులు రామకృష్ణ, గోపాల్, గ్రామస్తులు రామకృష్ణ, ఎర్రిస్వామి, సుధాకర్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

## వరదబాధితులకు స్వచ్ఛంధంగా సాయం చేయాలి



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు జగదీష్

**గుంతకల్లు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**

వరదముంపుకు గురైన బాధితులకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛంధంగా సాయం చేయాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యులు జగదీష్ పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ముందు వరదబాధితులను ఆదుకోవాలని ఫ్లెక్సీలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నేను సైతం అంటూ ముందుకు వచ్చి ధాన్యం, దుప్పట్లు, డబ్బులు విరాళంగా పంపాలన్నారు. అధిక వర్షాల వల్ల ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో వేలాది మంది నిరాశ్రయులు అయ్యారన్నారు. కట్టుబట్టలతో తినడానికి తిండి లేక విద్యుత్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మానవత్వంతో స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధికి తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రజలను కాపాడేందుకు సిపిఐ, యువజన విద్యార్థి సంఘాల నాయకులు విజయవాడలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయక కార్యదర్శి మహేష్, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, మండల కార్యదర్శి రాముారాయల్, నాయకులు రామాంజినేయులుయాదవ్, ఈశ్వరయ్య, దేవేంద్రప్ప, కుళ్లాయప్ప, ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకటనాయక్, వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి పండగను ప్రశాంతంగా జరుపుకుందాం

- సమన్వయ సమావేశంలో తహశీల్దార్ మహబూబ్‌బాషా, సీఐ సురేష్‌బాబు

**ఉరవకొండ, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహశీల్దార్ మహబూబ్‌బాషా. చిత్రంలో యుపీఎస్ సీఐ సురేష్‌బాబు, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు

ఈనెల 7వ తేదీ నుండి మొదలయ్యే వినాయక చవితి పండుగ వేడుకలను సజావుగా ప్రశాంతంగా జరుపుకుందామని ఇందుకు అందరూ సహకరించాలని తహశీల్దార్ మహబూబ్‌బాషా, యుపీఎస్ సీఐ సురేష్‌బాబు కోరారు. పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం వినాయక ఉత్సవాలపై ఉత్సవ సమితుల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్, సీఐ మాట్లాడుతూ వినాయక మండపాలు ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం, ఇతరత్రా ఏర్పాట్లపై ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. ఉరవకొండ ప్రాంతంలో ఎక్కువగా 3, 5వ రోజు వినాయక విగ్రహాల నిమజ్జనం జరుగుతుందని ఆ సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. విగ్రహాలను సూచించిన ప్రదేశాలు హెచ్ఎల్‌సీ, హంద్రీనీవా కాలువ, పీఏబీఆర్, ఎంపీఆర్, పెన్నహోబిళం నీటి పరివాహక ప్రాంతం తదితర ప్రదేశాలకు క్రమ పద్ధతిలో చేరుకొని నిమజ్జనం చేయాలని సూచించారు. వేడుకల్లో ఒకరినొకరు రెచ్చగొట్టేలా ఎవరూ వ్యవహరించవద్దని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ హరి ప్రసాద్, సీనియర్ సహాయకులు సాయికృష్ణ వంశీ, మండల పరిషత్ ఏఓ జయరాములు, ప్రభుత్వ ఆసుపత్రి పీపీ యూనిట్ వైద్యులు డాక్టర్ సాహితి, మేజర్ పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్, అగ్నిమాపక, ఎక్సైజ్, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికల గురుకులంలో హరితాంధ్ర వనం-మనం కార్యక్రమం

- మొక్కలు నాటిన ప్రిన్సిపాల్, గురుకులం సిబ్బంది

**ఉరవకొండ, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



గురుకులంలో జరిగిన వన మహోత్సవం దృశ్యం

పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీ లోగల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో బుధవారం హరితాంధ్ర వనం-మనం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపు మేరకు గురుకులం ప్రిన్సిపాల్ సునీత సిబ్బందితో కలిసి గురుకులం ఆవరణంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అధికారుల సహకారంతో వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుపాలన్న కలెక్టర్ లక్ష్యంమేరకు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

## రూపానాయక్ తండాలో అంగన్‌వాడీ భవనం కూల్చివేతపై ఐసీడీఎస్ పీడీ విచారణ

- వీడీసీకు సామాగ్రిను అప్పగించినట్లు ఎంపీడీఓ రాతమూలకంగా తెలియజేశారన్న పీడీ

**ఉరవకొండ, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



రూపానాయక్ తండాలో విచారణ జరుపుతున్న ఐసీడీఎస్ పీడీ డా॥బి.ఎన్.శ్రీదేవి

వజ్రకరూరు మండల పరిధిలోని రూపానాయక్ తండాలో 2020లో జరిగిన అంగన్‌వాడీ భవనం కూల్చివేతపై ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డా॥బి.ఎన్.శ్రీదేవి బుధవారం విచారణ జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా అంగన్‌వాడీ భవనాన్ని కూల్చివేసి భవనానికి సంబంధించిన సామాగ్రిను దుర్వినియోగం చేశారని గ్రామ పంచాయతీకు చెందిన కొందరు వార్డు సభ్యులు దాదాపు నెలన్నర క్రితం ఇచ్చిన పిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో పీడీ విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు మాట్లాడుతూ తమకు పిర్యాదు అందిన వెంటనే సంబంధిత మండల ఇంజనీర్, పంచాయతీ కార్యదర్శికు నోటీసులు ఇచ్చి రాతమూలకంగా వివరణ తీసుకున్నామన్నారు. భవనం శిధిలావస్థకు చేరుకోవడంతో స్పెషలాఫీసర్ వ్యవస్థ కొనసాగుతున్న సమయంలో పీఆర్ అధికారులు భవనం వినియోగ యోగ్యం కాదని సర్టిఫై చేసిన క్రమంలో స్పెషల్ ఆఫీసర్, కార్యదర్శి పంచాయతీలో తీర్మాణంచేసి భవనాన్ని కూలదోసి ప్రైవేటు భవనంలోకి అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చినట్లు రాతమూలకంగా తమకు వివరణ అందిందన్నారు. అయితే భవనానికి సబంధించిన సామాగ్రి ఏమైందన్న విషయమై ఎంపీడీఓకు లేఖ రాయగా ఆ సామాగ్రిను విలేజ్ డెవలప్ మెంట్‌కమిటీకు అప్పగించినట్లు ఎంపీడీఓ రాతమూలకంగా వివరణ ఇచ్చారని పీడీ గ్రామ మాజీ సర్పంచ్ ఎస్.కె.కేశవనాయక్, పిర్యాదు దారులకు వివరించారు. గ్రామంలో అంగన్‌వాడీ భవనాన్ని కూల్చివేసి కొందరు కొంత స్థలాన్ని కబ్జా చేశారని బంజారా నాయకులు పీడీ దృష్టికి తెచ్చారు. దీంతో ఆమె స్పందిస్తూ స్థలం అన్యాక్రాంతం కాకుండా చూస్తామని ఎవరైనా కబ్జా చేసివుంటే తప్పక చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ కార్యాలయ సూపరింటెండెంట్ శేఖర్, సూపర్‌వైజర్ పద్మ, మాజీ జెడ్పీటీసీ తులసినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 14న జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోండి

**ఉరవకొండ, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జీ డి.దుర్గా కళ్యాణి

ఈనెల 14వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకు అవకాశంవున్న సివిల్, క్రిమినల్ పెండింగ్ కేసులను పరిష్కరించుకునేలా కక్షిదారులను సంసిద్ధం చేయాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జీ, న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మెన్ డి.దుర్గా కళ్యాణి సూచించారు. పట్టణంలోని స్థానిక మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో బుధవారం సాయంత్రం లోక్ అదాలత్ సన్నాహక సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జడ్జీ డి.దుర్గా కళ్యాణి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో బ్యాంకు రికవరీ కేసులు, మ్యాక్ట్ కేసులు, వైవాహిక వివాదాలు, కార్మిక వివాదాల కేసులు, భూసేకరణ కేసులు, విద్యుత్, నీటి బిల్లులు (దొంగతనం కేసులు మినహా) చెల్లింపులు, అవెన్సులు, రిటైరల్ ప్రయోజనాలకు సంబంధించిన సేవల విషయాలు, రెవెన్యూ కేసులు, ఇతర పౌర కేసులు, (అద్దె, టెస్టమెంటరీ హక్కులు, నిషేదాజ్ఞ దావాలు నిర్దిష్ట పనితీరు దావాలు) తదితర కేసులు పరిష్కారానికి వీలుంటుందన్నారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, విడపనకల్లు, పాల్తూరు, వజ్రకరూరు ఎస్ఐలు, ఏఎస్ఐలు, సెబ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలి

- జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్



జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

**పుట్టపర్తి, ఆగస్టు 04, ప్రభాతవార్త**

వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో దాతలు ముందుకురావాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో విరివిగా విరాళాలు అందించాలన్నారు. మన రాష్ట్రంలో కోస్తా ఆంధ్రలో చాలా ప్రాంతాలు వరదల్లో చిక్కుకుపోయి ప్రజల పరిస్థితి ఆందోళన కరంగా ఉందన్నారు. కావున వారికి సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా ముందుకు రావాలన్నారు. అందుకు ప్రత్యేక బ్యాంకు ఖాతా నెంబర్, డిజిటల్ ప్లాట్ ఫామ్, క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. విరాళాలు అందించదలచుకున్న దాతలు అకౌంట్‌నెంబర్ SBI A/c name : CMRFA/c number : 38588079208Branch: AP Secretariat, Velagapudi.IFSC code : SBIN0018884 Union Bank of India A/c name : CM Relief FundA/c number : 110310100029039 Branch: AP Secretariat, Velagapudi.IFSC code : UBIN0830798లకు, సిఎస్ఆర్ (కార్పోరేట్ సామాజిక బాధ్యత) క్రింద విరాళాలు అందించదలచుకున్న వారు SBI- A/C name: Andhrapradesh state Disaster Management.- A/C number: 00000036897128069. Branch: MG Road, Vijayawada.- IFSC code: SBIN 0016857 కు విరాళాలు అందించవచ్చన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధి పేరున చెక్కుల ద్వారా కూడా సహాయం అందించవచ్చని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.

## విచారణ చేయరు.. బాధ్యులపై చర్యలు తీసుకోరు..!

-నిరుద్యోగులను కుచ్చుటోపి పెట్టినా స్పందించని విద్యాశాఖ
-తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్న కొందరు అధికారులు
-జిల్లా కలెక్టర్ స్పందించాలని కోరుతున్న బాధిత నిరుద్యోగులు

**ఉరవకొండ, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



ఒక ఎడ్యుకేషన్ ఫౌండేషన్ పేరుతో నిరుద్యోగులకు ఇచ్చిన ఉద్యోగ నియామక పత్రం (ఫైల్‌ఫోటో)

ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒక బడా కార్పొరేట్ కంపెనీ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ పేరుతో నిరుద్యోగులను నమ్మించి వారి నుండి లక్షలాది రూపాయలు డబ్బులు వసూళు చేసుకొని మోసం చేసిన ఘరానా మోసంపై విచారణ చేపట్టడానికి కూడా అధికారులు వెనుకాడుతుండటం విమర్శలు తావిస్తోంది. ఉరవకొండ నియోజవర్గంతోపాటు జిల్లా వ్యాప్తంగా జరిగినట్లు తెలుస్తున్న ఘరానా మోసాన్ని ఇటీవల పత్రికలు వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. 500 పైచీలకు విద్యార్థులున్న ఉన్నత పాఠశాలల్లో సదరు ఫౌండేషన్ వారు నేరుగా ఉద్యోగాలను సృష్టించి ఐటీ, డిజిటల్ స్కిల్ ట్రైనర్, వాలంటీర్ డిజిటల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలకు 1.2 లక్షల నుండి 1.5 లక్షల రూపాయలు డబ్బులిచ్చిన వారికి పోస్టింగులు ఇవ్వగా జిల్లా, మండల విద్యాశాఖల అధికారులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎలాంటి విచారణ చేయకుండా, ముందుచూపు లేకుండా వారిని పాఠశాలల్లో నియామకాలకు అనుమతులు ఇవ్వడం జరిగిపోయింది. నెలలు తరబడి సదరు కార్పొరేట్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సృష్టించిన ఉద్యోగాలు చేస్తున్నా నెలనెలా ఇస్తామన్న జీతాలు రాకపోవడం, జీతాల కోసం సదరు ఫౌండేషన్ పేరుతో డబ్బులు వసూళు చేసిన వారిని గట్టిగా ప్రశ్నించడంతో ఇది పకడ్బందీగా జరిగిన ఘరానా మోసమని బహిర్గతమైంది. ఇందులో ఉరవకొండ పట్టణానికి చెందిన నాడు అధికార పార్టీ నాయకులుగా చెలామణి అయిన వారు, విద్యాసంస్థల అధినేతలు భాగస్వాములు ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది ఒక్క ఉరవకొండ నియోజకవర్గంలోనే కాకుండా జిల్లా అంతటా ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన క్రమం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది. అయితే పత్రికలు ఈ వ్యవహారాన్ని ఆధారాలతో వెలుగులోకి తెచ్చినా ఈ ఘరానా మోసంలో సూత్రదారులెవరు..పాత్రదారులెవరన్న విషయాన్ని నిగ్గుతేల్చి డబ్బులిచ్చి మోసపోయిన నిరుద్యోగులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత కల్గిన విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. సమగ్ర విచారణకు అదేశించకుండా తేలుకుట్టిన దొంగల్లా ఎందుకు వ్యవహరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఒక్క ఉరవకొండ నియోజకవర్గంలోనే దాదాపు 20 మంది నుండి లక్షలాది రూపాయలను ఉద్యోగాల పేరిట వసూళు చేయడం, లేని ఉద్యోగాలు సృష్టించి వారే నియామక పత్రాలు ఇచ్చి పాఠశాలల్లో చేర్పించడం నెలలు తరబడి వారితో పనిచేయించి గట్టిగా అడిగిన వారికి మాత్రమే ఒకటి రెండు నెలల జీతాలు అంటూ అకౌంట్‌లో నెలకు 10వేల రూపాయల వంతున పంపి మిగిలిన వారికి మోండి చేయి చూపడం జరుగగా జిల్లా వ్యాప్తంగా ఈ ఘరానా మోసంలో ఎంత మంది నిరుద్యోగులు లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నారో అర్థం చేసుకోవచ్చు. వెలుగులోకి వచ్చిన ఉద్యోగాల పేరుతో ఈ మోసంపై జిల్లా కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించాలని బాధిత నిరుద్యోగులు కోరుతున్నారు.

## ప్రత్యామ్నాయ విత్తనాల కొరకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోండి

- వ్యవసాయ అధికారి ముస్తఫా..

**ధర్మవరం రూరల్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



వ్యవసాయ అధికారి ముస్తఫా..

ప్రస్తుత వర్షాభావ ప్రభావం వల్ల 2024 ఖరీఫ్ సీజన్ సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడి కింద ఉలవలు, పెసలు, అలసందలు, విత్తనాలను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఎలాంటి పంట వేయని రైతు ప్రస్తుత సీజన్ ప్రత్యామ్నాయ విత్తనము కొరకు రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎన్ఎం.ముస్తఫా ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట వేసిన తర్వాత ప్రతి రైతు కచ్చితంగా ఇ పంట నమోదు చేసుకోవాలని అందువల్ల రైతుకు 80 శాతం సబ్సిడి పోను రైతుల చెల్లించవలసిన ధర ఉలవలు (10కెజిలు) రూ.174, పెసలు 4కెజిలు రూ.104, అలసందలు (10కెజిలు రూ.226, చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.




## చైనా నుంచి దిగుమతి అయ్యే ఉక్కుపైన 12శాతం దిగుమతి సుంకం విధించాలి

### - ప్రధానికి ఉక్కుమంత్రి కుమారస్వామి మనవి

**బెంగళూరు,సెప్టెంబర్ 4,ప్రభాతవార్త ప్రతినిధి**

దేశంలో ఉక్కు ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు చైనా నుంచి దిగుమతి అయ్యే ఉక్కుపై దిగుమతి సుంకం పెంపు చేస్తామని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి చెప్పారు. ఆయన ఇవాళ అసోఛామ్ నిర్వహించిన భారత స్టీల్ పరిశ్రమల సంఘం కాన్‌క్లేవ్‌లో మాట్లాడారు. ప్రపంచంలోనే ఇండియా ఉక్కుఉత్పత్తిలో రెండుస్థానంలో ఉందని చెప్పారు. వికసిత్‌భారత్ కార్యక్రమంలో ఆత్మనిర్భర్ పథకంలో ఉక్కు పరిశ్రమల ఉత్పాదన సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్ర సర్కారు చర్యలు తీసుకోనుందని చెప్పారు.దేశీయ ఉక్కు ఉత్పాదనలో డబుల్‌డిజిట్ సంఖ్యలో అభివృద్ధి సాధిస్తున్నామని తెలిపారు.ఇండియాకు పోటీ ఇస్తున్న చైనా ఉక్కును అదుపు చేసేందుకు ఇకమీదట ఉక్కు దిగుమతులపైన 12శాతం దిగుమతి సుంకం విధిస్తామని ఈమేరకు కేంద్రపన్నులశాఖకు మనవి చేస్తామన్నారు. ఉక్కుపరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు.



అసోఛామ్ సమావేశంలో పాల్గొన్న కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి.

## రాయచూరు జిల్లాలో వాగులో కొట్టుకుపోయిన బ్యాంక్ సిబ్బంది ఒకని మృతి

**రాయచూరు,సెప్టెంబర్ 4,ప్రభాతవార్త ప్రతినిధి**

రాయచూరు జిల్లా రాయచూరు తాలూకాలో బుధవారం ఒక గ్రామం వద్ద వాగునుదాటుతున్న 9మంది వ్యక్తులు వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన దుర్ఘటన జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఫత్తేపుర వంతెన వద్ద రోడ్డు దాటేందుకు వెళుతున్న వ్యక్తులు అక్కడి వరద తాకిడికి కొట్టుకుపోయారు.వీరిలో 8మందిని సమీపంలోని గ్రామస్తులు రక్షించారు.బసవరాజు (38) అనే ప్రవేట్ బ్యాంకు ఉద్యోగి వరదనీటిలో కొట్టుకుపోయి మృతి చెందాడు.ఇతడి మృత దేహం కోసం పోలీసులు జాలర్లను పిలిపించి గాలిస్తున్నారు.

## శివమొగ్గ జిల్లాలో రోడ్డు ప్రమాదం

### - ఒక యువకుడు మృతి

**శివమొగ్గ, సెప్టెంబర్ 4,ప్రభాతవార్త ప్రతినిధి**

శివమొగ్గ తాలూకా గుత్తిహళ్లి గ్రామం వద్ద బుధవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక ట్రక్ కారును ఢీకొట్టింది. ఈప్రమాదంలో కారులోని నలుగురు తీవ్రంగా గాయపడగా మంజునాద్ అనే యువకుడు స్థలంలో మృతి చెందాడు.గుత్తిహళ్లి వద్ద వేగంగా ఎదురు నుంచి వచ్చిన ట్రక్ కారును ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది.గాయపడినవారిని శివమొగ్గ పట్టణం పెద్దాసుపత్రిలో చికిత్సకోసం చేర్చారు.ఈమేరకు కేసు నమోదు అయ్యింది.

## చెన్నపట్టణ బైఎలక్షన్ ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి పోటీ చేస్తారు -నిఖిల్ కుమారస్వామి

**కొప్పళ్,సెప్టెంబర్ 4,ప్రభాతవార్త ప్రతినిధి**

చెన్నపట్టణ విధానసభ ఉప ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి పోటీ చేస్తారని జెడిఎస్ యువజనతాదళ్ అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి చెప్పారు.ఆయన బుధవారం కొప్పళ్ పట్టణంలో ఈమేరకు మీడియాతో మాట్లాడారు.ఈ సీటుకు జెడిఎస్ లేదా బిజెపి నుంచి ఎవరు పోటీ చేయాలనేది ఎన్డీఏ నాయకులు తీర్మానిస్తారని చెప్పారు.గత విధానసభ ఎన్నికల్లో హెచ్‌డి.కుమారస్వామి భారీ మెజారిటీతో ఎన్నికయ్యారు. ఆతరువాత ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కుమారస్వామి పొరుగున ఉన్న మండ్య లోక్‌సభకు పోటీచేసి గెలుపొందటంతో చెన్నపట్టణ సీటుకు ఉప ఎన్నిక అనివార్యవమైందని చెప్పారు.ఇక్కడ మా కేడర్ జెడిఎస్ పార్టీ కే ఈసీటును కేటాయించాలని కోరుతున్నారు.గతం నుంచి రామనగర జిల్లా మా తండ్రి కుమారస్వామికి,మాతాత దేవెగౌడకు రాజకీయంగా జన్మనిచ్చిన ప్రాంతం.ఇక్కడ జెడిఎస్ పార్టీకు బలమైన కేడర్ ఉందన్నారు. బిజెపి నాయకులు తమకు ఈసీటును కేటాయించాలని మనవి చేస్తున్నారు. దీనిపై ఎన్డీఏ అగ్రనాయకులు ఢిల్లీలో నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.అప్పటివరకు ఈ సీటుకు జెడిఎస్ లేదా బిజెపి పోటీ చేస్తుందా అనే విషయంలో రెండు పార్టీల నాయకులు పోటాపోటీగా ప్రకటనలు చేసి ఓటర్లలో గందరగోళం సృష్టించవద్దని మనవి చేశారు.నేను పోటీ చేసే విషయం ఇంకా కరారు కాలేదని స్పష్టీకరించారు.

## బెంగళూరు నగరంలో గుంతలు పూడ్చివేతకు అన్ని చర్యలు - తుషార్ గిరినాధ్

**బెంగళూరు, సెప్టెంబర్ 4,ప్రభాతవార్త ప్రతినిధి**

బెంగళూరు నగరంలో రోడ్లకు పడిన గుంతలు పూడ్చివేసేందుకు పాలికె సిబ్బంది అన్ని వార్డుల్లో చురుగ్గా పని చేస్తున్నారని పాలికె కమిషనర్ తుషార్ గిరినాధ్ చెప్పారు.నగరంలో గుంతలమయం అయ్యిందని సుమారు 1800మంది పాలికెకు ఫిర్యాదులు చేశారని తెలిపారు. వానలు తగ్గినవెంటనే అన్నిచోట్ల గుంతలు పూడ్చేందుకు పాలికె సిబ్బంది పెద్దపెద్ద గుంతలను పూర్తిగా పూడ్చివేస్తారన్నారు.నగర గుంతల గురించి ఉపముఖ్యమంత్రి పాలికె అధికారులను హెచ్చరించిన నేపథ్యంలో బిబిఎంపి కమిషనర్ బుధవారం ఈమేరకు మీడియాకు చెప్పారు.ప్రధాన రహదారుల్లోను సిగ్నల్స్ వద్ద మొదట ప్రాధాన్యత ఆధారంగా గుంతలను పూడ్చివేస్తున్నామని చెప్పారు.

## ఈనెల 23న మూత పడనున్న శివమొగ్గ విమానాశ్రయం

**శివమొగ్గ, సెప్టెంబర్ 4,ప్రభాతవార్త ప్రతినిధి**

శివమొగ్గలో బిజెపి సర్కారు హయాంలో అట్టహాసంగా ప్రారంభమైన శివమొగ్గ ఏర్‌పోర్ట్‌కు డిజిసిఎ ఇచ్చిన లైసెన్సు ఈనెల 23తో ముగిసిపోనుండటంతో ఈ విమానాశ్రయం మూతపడుతుందని శివమొగ్గలో బుధవారం టాక్‌వచ్చింది.గత 2023 ఫిబ్రవరి 27న భారత ప్రధాని శివమొగ్గ విమానాశ్రయాన్ని అట్టహాసంగా ప్రారంభించారు.ఆరంభంలో గోవా,బెంగళూరు,తిరుపతి,హైదరాబాదు పట్టణాలకు నిత్యం సర్వీసులను తిప్పిన ఈ విమానాశ్రయం లైసెన్సుగడువు గత ఆగస్టు 23కు ముగిసిపోవటంతో విమానాశ్రయం మేనేజిమెంట్ మరో నెలపాటు లైసెన్సును నవీకరించారు.అదీ కూడా ఈనెల 23న ముగిసిపోనుంది.ఈ విమానాశ్రయంకు పెట్టుబడులు పెట్టిన కర్ణాటక ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ శివమొగ్గ ఏర్‌పోర్ట్‌లో మౌలికసదుపాయాలు కల్పించింది.ఇపుడు దీని లైసెన్సు గడువు ముగిసిపోతుండటంతో విమానాశ్రయం నిర్వహణ అధికారులు ఏ చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.మలెనాడు ప్రాంతంలోని శివమొగ్గలో మాజీ సిఎం యడ్యూరప్ప చొరవతో తెరిచిన శివమొగ్గ ఏర్‌పోర్ట్‌కు గ్రహణం పట్టనుందా అనే చర్చ బుధవారం శివమొగ్గ పట్టణంలో జరిగింది.కాంగ్రెస్ సర్కారు ఈ ఏర్‌పోర్టు గురించి ఏ చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

## ముడా కేసులో ముడా కమిషనర్ సస్పెండ్ కు బాధ్యత వహిస్తూ సిఎం రాజీనామా చేయాలి - విజయేంద్ర

**బెంగళూరు,సెప్టెంబర్ 4,ప్రభాతవార్త ప్రతినిధి**

ముడా అక్రమ సైట్ల పంపిణీ కేసులో ముడా కమిషనర్ దినేష్‌కుమార్‌ను సర్కారు సస్పెండ్ చేయటంతో ఈకేసుకు నైతికబాధ్యత వహిస్తూ సిఎం సిద్ధరామయ్య వెంటనే రాజీనామాచేయాలని బిజెపిఅధ్యక్షుడు బివై.విజయేంద్ర డిమాండ్‌చేశారు.ఆయన బుధవారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడారు.ముడా కేసులో అసలు అక్రమాలుజరగనేలేదని సిఎం విధానసభ సాక్షిగా బుకాయించారు.ఇపుడు సదరు మాజీ కమిషనర్‌ను సస్పెండ్ చేశారు. ముడాలో అక్రమాలు జరగకపోతే దినేష్‌కుమార్‌ను దేనికోసం సస్పెండ్ చేశారని సిఎంను నిలదీశారు.ముడా కేసులో సిఎంపై విచారణ గురించి హైకోర్టులో వాదోపవాదాలు జరుగుతున్నాయి.సిఎం రాజీనామా చేసే పరిస్థితి ఆసన్నమైందని చెప్పారు.ఇలాగే వాల్మీకి కార్పొరేషన్ అక్రమాల్లోను ఎవ్వరి పాత్రలేదని తోసిపుచ్చారు. ఈకేసు కూడా త్వరలో విచారణకు రానుంది.ఈరెండు కేసుల్లోను సిఎం అనివార్యంగా రాజీనామా చేయాల్సిందే అని చెప్పారు.బిజెపి కర్ణాటకలో పోయిన సారి కోటి 5లక్షల మందిని సభ్యులుగా చేర్చాము.ఈసారి అంతకుమించి సభ్యత్వాలు జరుపుతామని అన్నారు.సిఎంపై ఆరోపణలు చేశారన్నఅక్కసుతోనే విధానపరిషత్ ప్రతిపక్ష నాయకుడు చలవాది నారాయణస్వామిపైన అక్రమ కేసు బనాయించి గవర్నర్‌కు ఫిర్యాదు చేశారని విమర్శించారు.

## కన్నడ చలనచిత్ర రంగానికి మాయని మచ్చ తెచ్చిన దర్శన్ హత్యకేసు

### - కోర్టుకు 4వేలపేజీల అభియోగపత్రం సమర్పించిన బెంగళూరు పోలీసులు



రేణుకాస్వామి హత్యకేసులో ముద్దాయిలు దర్శన్,పవిత్రా గౌడ.

**బెంగళూరు,సెప్టెంబర్ 4,ప్రభాతవార్త ప్రతినిధి**

తన సహచరురాలికి అశ్లీల మేసేజులు పంపాడన్న కోపంలో చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి అనే యువకుడిని హత్యచేయించిన సినీహీరో దర్శన్ అండ్ గ్యాంగ్‌పైన కామాక్షిపాళ్య పోలీసులు 4వేల పేజీల అభియోగపత్రాన్ని సిద్ధంచేసి కోర్టుకు బుధవారం సమర్పించారు. విజయనగర ఎసిపి చందన్ నాయకత్వంలో కామాక్షిపాళ్య పోలీసులు రేణుకాస్వామి హత్యకేసులో 231మంది సాక్ష్యాలు సేకరించారు.దీంట్లో 56మంది పోలీసులు అధికారుల సాక్ష్యాలు ఉన్నాయి.ఈఏడాది ఫిబ్రవరి 7న రేణుకాస్వామి పవిత్రాగౌడకు అశ్లీల మేసేజులు పంపటం నుంచి అతడు హత్యకు గురైన జూలై 7వరకు జరిగిన వివిధ ఘటనల సాక్ష్యాలను పోలీసులు సేకరించారు.ఈకేసులో 17మందిని ముద్దాయిలుగా పేర్కొంటూ పోలీసులు అరెస్టు చేశారు వీరిలో 14మందిపైన కిడ్నాపు కేసు 3పపైన సాక్ష్యాలు నాశనం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. వీరంతా ఇపుడు కర్ణాటకలోని వివిధ జిల్లా జైళ్లలో రిమాండ్‌లో ఉన్నారు.హీరో దర్శన్‌ను రెచ్చగొట్టి రేణుకాస్వామి హత్యకు కారకురాలైన పవిత్రాగౌడను ఈకేసులో ఎ1 నిందితురాలిగా ఉండగా, ఎ2 నిందితుడిగా దర్శన్ ఉన్నాడు.కన్నడ సినీరంగంలో ఉచ్ఛస్థితిలో నెంబర్1 హీరోగా వెలిగే కాలంలో దర్శన్ చేతులారా చేసుకున్న కర్మకాండ రేణుకాస్వామి హత్యకేసు రూపంలో అతడిని వెంటాడుతోంది.పోలీసులు సందర్భానుసారంగా వివిధ కోణాల్లో సేకరించిన సాక్ష్యాలు కేసును మరింత బిగుతుగా చేసింది.ఈకేసులో దర్శన్‌కు బెయిల్‌దొరికే అవకాశంలేదని పోలీసుఅధికారులు అంటున్నారు. 3991పేజీల ఛార్జిషీటును బెంగళూరు 24వ అడిషనల్ ఛీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి మారుతేష్ పరశురామ్ మోహిత్‌కు పోలీసులు ఇవాళ సమగ్రంగా వాగ్మూలాలతో సాక్ష్యాలతో ఛార్జిషీటును సమర్పించారు. ఈ కేసును త్వరలోనే సెషన్స్ కోర్టుకు బదిలీచేస్తారు.ఇందుకోసం కర్ణాటక సర్కారు త్వరిత న్యాయాలయాన్ని కూడా ఏర్పాటు చేసింది.

## బెంగళూరులో ఆటోరిక్షాపైన విరిగిపడిన చెట్టు డ్రైవరు మృతి

**బెంగళూరు,సెప్టెంబర్ 4,ప్రభాతవార్త ప్రతినిధి**

బెంగళూరులో గత రెండు మూడురోజులుగా కురుస్తున్న వానల వలన పలుచోట్ల పెద్దపెద్ద వృక్షాలు కూలిపోతున్నాయి.రెండు రోజుల కిందట చిన్నస్వామిక్రికెట్ స్టేడియం రోడ్డులో ఉన్నట్టుండి ఒక పెద్ద కానుగ చెట్టు కూలిపోయి మూడు కార్లపైన పడిపోవటంతో కారులోని ప్రయాణీకులకు గాయాలయ్యాయి.తాజాగా బుధవారం ఉదయం జయనగర్ నాలుగోబ్లాక్‌లో ఒకపెద్దవృక్షం ఆటోరిక్షాపైన హఠాత్తుగాకూలిపోవటంతో ఆటోరిక్షాను నడుపుతున్న డ్రయివరు ఖలీల్ (35)కు తీవ్రగాయాలయ్యాయి.అతడిని చికిత్సకోసం నిమ్హాన్స్‌కు చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ ఈ సాయంత్రం మృతి చెందాడు.ఈమేరకు జయనగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది.

## కన్నడ సినిమా రంగంలోను క్యాస్టింగ్ కౌచ్ కీచకపర్వం

### - విచారణకు కమిటీ వేయాలని సిఎంకు మనవి చేసిన 165మంది సినీనటులు

**బెంగళూరు,సెప్టెంబర్ 4,ప్రభాతవార్త ప్రతినిధి**

మళయాళ చిత్రపరిశ్రమలో తుఫాన్ లేపిన క్యాస్టింగ్ కౌచ్ ఉదంతాల మాదిరిగానే కన్నడ చలనచిత్ర పరిశ్రమలోను ఇలాంటి సంఘటనలు జరిగాయని వీటి గురించి దర్యాప్తు చేసేందుకు కర్ణాటక సర్కారు ఒక ఉన్నతస్థాయి కమిటీ వేయాలని సినీనటులు బుధవారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఒక మనవి పత్రం సమర్పించారు.ఈమేరకు కన్నడ హీరో చేతన్ నాయకత్వంలోని ఫైర్ అనే సంస్థ 152 మంది నటీనటుల చేత సంతకాలు సేకరించి సిఎంకు మనవి పత్రం సమర్పించింది.గతంలో కన్నడ చిత్రసీమలో జరిగిన సినీతారలపైన లైంగిక దౌర్జన్యాల గురించి మీ టూ అనే ఆందోళన జరిగిన విషయం విదితమే.ఇపుడు పొరుగున మాలీవుడ్ చిత్రసీమలో జరిగిన ఘోరాల పట్ల జస్టిస్ హేమా కమిటీ నివేదిక వెల్లడి కావటంతో అక్కడ పెద్ద సంచలనం చెలరేగింది.కన్నడ చిత్రసీమలోను ఇలాంటి క్యాస్టింగ్ కౌచ్ ఉదంతాలు చాలానే జరిగాయని వీటిని బయటకు తీసేందుకు ఉన్నతస్థాయి కమిటీ వేస్తే తామంతా సదరు కమిటీకు వివరాలను బహిర్గతం చేస్తామని పలువురు తారలు బుధవారం చెప్పారు.సినీహీరోయిన్ ఐంద్రితా రై, నీతు,కవితా లంకేష్,పూజాగాంధీ, రమ్యా,చైత్రా ఆచార్,అమృతా అయ్యర్,సంగీతభట్ తదితరులు జస్టిస్ హేమా కమిటీ లాంటిది కర్ణాటక సర్కారు కూడా నియమించాలని డిమాండ్ చేశారు.చాలాసార్లు సిన్మా షూటింగుల్లో అనేకమంది మహిళా నటులకు ఇలాంటి చెడు అనుభవాలు ఎదురయ్యాయని చెప్పారు.సిన్మా షూటింగుల్లో నోటీదురద తీర్చుకునేందుకు అసభ్యపదజాలంతోను నటీమణులను కించపరచేవారు కొదవలేరని చెప్పారు. ఎన్నో అవమానాలను ఓర్చుకుని పనిచేశారని తెలిపారు.సినీమా తారలను కించపరచే వాతావరణం కూడా ఇక్కడ ఉందని అన్నారు.పనిచోట్లలో మంచి వాతావరణం నిర్మించటానికి ఆరోగ్యవంతమైన సమాజం కృషిచేయాలని కోరారు.

## బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకులంలో సజావుగా ప్రవేశ పరీక్షలు

### - 6, 8వ తరగతుల్లో ప్రవేశ పరీక్షలకు 98 మంది హాజరు

**ఉరవకొండ, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**

పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలోగల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో 6, 8 తరగతుల్లో సీట్ల భర్తీ కోసం బుధవారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా కొనసాగాయి. గురుకులంలో 6వ తరగతిలో 5 సీట్ల కోసం 83 మంది విద్యార్థినులు పరీక్ష రాయగా, 8వ తరగతిలో ఒక సీటు కోసం 15 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. గురుకులం ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో జరిగిన పరీక్షను పెద్దపప్పూరు గురుకులం పాఠశాలకు చెందిన రజాక్ పర్యవేక్షించారు.

## ఆర్ఎంపిలు ప్రథమ చికిత్సమాత్రమే చేయాలి...

**గుమ్మఘట్ట, సెప్టెంబర్ 04 ప్రభాతవార్త:**



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

మండల పరిధిలోని ఆర్ఎంపి డాక్టర్లు ప్రథమ చికిత్సమాత్రమే చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఉన్నటు వంటి ఆర్ఎంపి డాక్టర్లు ప్రథమ చికిత్సలు మాత్రమే చేయాలని, యాంటిబయోటిక్స్ మందులు, గ్లూకోజ్ బాటిల్స్, ఇంజెక్షన్లు వేయకుండా కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేసి మెరుగైన వైద్యం కోసం దగ్గరలో ఉన్న ఆసుపత్రికి రేఫర్ చేయాలని తెలిపారు. ఆర్ఎంపిలు ఎవరైనా ఎక్కడైనా ఇంజెక్షన్లు, యాంటిబయోటిక్స్ మందులు, గ్లూకోజ్ బాటిల్స్ పెట్టినట్లు సమాచారం తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ రమేష్ పేర్కొన్నారు.

## వరద బాధితుల సహాయార్థం ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు విరాళాల సేకరణ..

**కళ్యాణదుర్గం టౌన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



విరాళాలను సేకరిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు

ఆంధ్ర ప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో వరద బాధజతుల సహాయార్థం విరాళాల సేకరణ కోసం ముఖ్య మంత్రికి పిలువు మేరకు వారం రోజుల పాటు కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు విరాళాల సేకరణ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఆర్‌డిఓ డా.రాణి సుస్మిత చేతుల మీదప్రారంభించారు. వారం రోజులు ప్రణాళికలో భాగంగా బుధవారం ప్రభుత్వ కార్యాలయాలైన రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం, తహశీల్దారు కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, ట్రెజరర్.. వివిధ బ్యాంకులలో ప్రతి ఒక్క పౌరుడు, ప్రతి ఒక్క ఉద్యోగి తోచినంత విరాళాలు ఇచ్చి తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. వారం రోజుల్లో తొలిరోజైన పై విభాగాల్లో విరాళాల సేకరణ జరిగింది. మొదటి రోజు వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, రెండవ రోజు ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలు, మూడవ రోజు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, నాల్గవ రోజు బస్టాండ్ పరిసర ప్రాంతాలు, ఐదవ రోజు పట్టణంలోని షాపులు, ఆరవ రోజు కోర్టు పోలీస్ డిపార్ట్‌మెంట్, జైలు శాఖ, ఏడవరోజు పట్టణంలోని ప్రముఖ ప్రాంతాల్లో విరాళాలు సేకరించనున్నట్లు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ఈ విరాళాల సేకరణ కార్యక్రమంలో అధ్యాపకులు శేషయ్య, సూర్య నాగిరెడ్డి, శ్యాం ప్రసాద్, గురు మోహన్, ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు పాల్గొన్నారు.

## ఇంకా ఇసుక రీచ్‌లను గుర్తించ లేదు.. అయినా ఇసుకను తరలిస్తున్నారు

### - మండల ప్రజల ఆవేదన

**అగళి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**

అగళి మండలంలో దాదాపు ఏడు కిలోమీటర్ల వరకు సువర్ణ ముఖి విస్తీర్ణంలో ఉంది. వర్షాలు వచ్చినందున ఎగువ ప్రాంతాల నుంచి కురిసిన వర్షానికి సువర్ణ ముఖి నది ఇసుక ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక తీసుకోవడం చాలా కష్టంగా ఉంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు ఉచితంగా ఇసుకను ఇవ్వాలని నిర్ణయించారు. ఇండ్లు, మరుగుదొడ్లు, ఇతరాత్ర పనులకోసం ఇసుకను తీసుకోవచ్చు. అయితే జియాలజీ శాఖ వారు ఇసుక రీచ్‌లను గుర్తించిన చోట ఇసుకను తీసుకురావాలి. ప్రభుత్వం ఇసుకను తరలించే వాహనాలకు రవాణా చార్జీలను చెల్లించాల్సి ఉంది. ఇసుక రీచ్‌లను గుర్తించిన చోట ఇసుక డిపోను ఏర్పాటు చేస్తారు. ఆ డిపో దగ్గర ఇసుక ఇండెంట్ కోసం పేర్లు నమోదు చేసుకోవాలి. డిపోవారు ఇసుకను ఇస్తారు. ఇసుక తరలించే వాహనాలకు నెంబర్లను కేటాయిస్తారు. ఎవరంటే వారు ఏ వాహనాల్లోనైనా ఇసుకను తరలించడానికి వీలు లేదు. అదీ మరీ ముఖ్యంగా రీచ్‌లను గుర్తించిన చోట మాత్రమే ఇసుక డిపోల ద్వారా ఇసుకను తీసుకురావాలి. అలా కాకుండా ఎవరి అనుమతి లేకుండా రీచ్‌లను గుర్తించ కుండా అగళి మండలంలో ఇసుకను ఎలాంటి అనుమతి లేకుండా కొందరు తరలిస్తున్నారని, ఇది ఎంత వరకు సమంజసమని రైతులు, మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇసుక రీచ్‌లను గుర్తించిన చోట ఎన్ని అడుగుల ఇసుకను తవ్వాలో అధికారులు నిర్ణయిస్తారు. గత 20-30 ఏళ్ల నుంచి సువర్ణ ముఖి నదిలో గతంలో ఎదేచ్చగా ఇసుక అక్రమ రవాణా చేయడం ద్వారా మండలంలోని వేలాది బోర్లు, బావులు ఎండిపోవడంతో పాటు వేలాది వక్క, కొబ్బరి చెట్లు ఎండిపోయాయి. 30 సంవత్సరాల అనంతరం అగళి చెరువుకు రెండేళ్ల క్రితం నిండింది. ఎగువ ప్రాంతంలో వర్షం వస్తే సువర్ణ ముఖికి ఇసుక చేరుతుంది. ఇసుక సువర్ణముఖి నదిలో ఉంటే బోర్లు బావుల్లో నీళ్లు సంవృద్ధిగా ఉండటంతోపాటు వక్క, కొబ్బరి, మామిడిచెట్లు ఎ ండవు. అందుకే సువర్ణముఖి నదిలో ఎవరూ తరలించకూడదని ఒక వేళ రీచ్‌లను గుర్తిస్తే అధికారుల అనుమతి మేరకు తరలించ వచ్చని అనుమతి లేనిదే ఇసుకను తవ్వితే చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు, సిఐ రాజ్‌కుమార్ హెచ్చరిస్తున్నారు.

## శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం తీసుకోవాలి

### - పౌష్టికాహార మాసోత్సవాల్లో సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ తేజస్వి

**ఉరవకొండ, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



అవగాహన కల్పిస్తున్న వైద్యులు డాక్టర్ తేజస్వి

వ్యక్తి యొక్క శారీరక, మానసిక ఎదుగుదల సక్రమంగా ఉండాలంటే నిత్యం పౌష్టికాహారం భుజించడం ఎంతో అవసరమని సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ తేజస్వి అన్నారు. వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని సీహెచ్‌సీతోపాటు మహాత్మా జ్యోతిరావు పూలే ప్రభుత్వ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం ప్రిన్సిపాల్ జోనాథన్ అధ్యక్షతన పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజస్వి మాట్లాడుతూ మన ఆరోగ్యం మనం తీసుకునే ఆహారం మీద ఆధారపడి ఉంటుందని ఆహారంలో అన్ని పోషక పదార్థాలు సరైన మోతాదుల్లో ఉండేలా చూసుకోవాలన్నారు. శరీరం పనిచేయడానికి కేలరీలు, పెరుగుదలకు విటమీన్లు, ఖనిజ లవణాలు వంటి అనేక పోషక పదార్థాలు తగిన నిష్పత్తిలో లభిస్తేనే మనిషి ఆరోగ్యంగాను, ఉత్సాహంగాను ఉంటారన్నారు. పోషక పదార్థాలు మనిషి వయసునుబట్టి, చేసే పనిని బట్టి అవసరమైన మోతాదులో తీసుకోవాల్సి ఉంటుందని స్త్రీ, పురుష అవసరాలలో కూడా వ్యత్యాసం ఉంటుందన్నారు. శారీరకంగా కష్టపడి బరువుపని చేసే వారికి, తేలికపని చేసే వారికంటే దాదాపు 1 1/2 రెట్లు అధిక పోషక పదార్థాలు అవసరం అవుతాయన్నారు. పెరిగే పిల్లలు, గర్భిణీలు, పాలిచ్చేతల్లులకు పోషకపదార్థాల అవసరంఎక్కువగా ఉంటుందన్నారు. ముసలితనంలో శక్తి, కొవ్వు పదార్థాలను తక్కువగా తీసుకోవాలని, యుక్త వయసులోని అడవారు ఐరన్ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మగ పిల్లలు కండర పటుత్వానికి మాంసాహారాలు అధికంగా తినాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ సుశీలమ్మ, ఏఎన్ఎంలు పద్మావతి, భవ్యఉషా మౌనిక, ఎంఎల్‌హెచ్‌పీలు లక్ష్మికాంతమ్మ, మణి, శ్రావణి, ఆరోగ్య కార్యకర్తలు బాబావలి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శుభకార్యాల్లో పాల్గొన్న టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి



శుభకార్యంలో పాల్గొన్న మాజీ ఎంఎల్‌సి

**అమరాపురం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**

మండలంలోని కరిదాసనహట్టి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువనాయకుడు కాంతరాజు నూతన గృహప్రవేశానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మడకశిర నియోజకవర్గం ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అదేవిధంగా నామకరణం కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమాలకు హాజరైన వారిని శాలువాలతో సత్కరించారు. అలాగే మడకశిర నియోజకవర్గం కుంచిటి ఒక్కలిగ సంఘం అధ్యక్షులు అనంతరాజు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ మనోహర్, అమరాపురం మండల టిడిపి అధ్యక్షులు గణేష్, పరమేశ్వరప్ప, శివకుమార్, జయరాం, మద్దనకుంట రఘు, తిమ్మేగౌడ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## వక్కసాగులో యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడి

**అమరాపురం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



వక్కగెలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం ఆవరణలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో వక్క రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ శాస్త్రవేత్త ఈ.చంద్రాయుడు, శాస్త్రవేత్తలు యుగంధర్, శిరీష, హరిణి, మల్లికార్జున, వ్యవసాయాధికారి మంజునాథ్, తదితరులు పాల్గొని రైతులకు నూతన వంగడాలు, పంటసాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల యువరైతు నాయకుడు నాగోనపల్లి మంజునాథ్, టిడిపి మండల అధ్యక్షులు గణేష్, మాజీ జెడ్‌పిటిసి నరసింహ మూర్తి, మండల ప్రధాన కార్యదర్శి జయరామప్ప, శివరుద్రప్ప, మాజీ ఎంపిపి కృష్ణమూర్తి, ఎస్‌సి సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్, ఎంపిటిసి ఓంకారస్వామి, తదితరులుపాల్గొన్నారు. ఈసందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త చంద్రాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే కృషి విజ్ఞాన కేంద్రాలు రైతులకు వ్యవసాయ పంట సాగుపై అవగాహన కల్పించడంతో పాటు ఆ ప్రాంతాలకు సంబంధించిన భూమికి అనుగుణంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి పంట సాగుపై రైతులను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. అమరాపురం మండల వ్యాప్తంగా 6 వేల ఎకరాల్లో వక్క సాగును ప్రోత్సహించడంతో పాటు అంతరపంటగా మిరియాలు సాగు కూడా ప్రోత్సహిస్తామన్నారు. ప్రస్తుతం కేరళ రాష్ట్రంలో మిరియాల సాగుపై రైతులను సందర్శన నిమిత్తం తీసుకెళ్లి అక్కడి నుండి అధిక దిగుబడి సాధించే విత్తనాలను తెప్పించి రైతులకు మిరియాలు సాగుపై ప్రోత్సహిస్తామన్నారు. అదేవిధంగా మార్కెట్ సౌకర్యం ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 1200 కోట్లతో దేశవ్యాప్తంగా ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ కంపెనీలను ప్రోత్సహిస్తూ వీటి ద్వారా రైతులకు వివిధ సబ్సిడీలతో కూడిన యంత్రాలు, పంటలు సాగు మార్కెటింగ్ వంటి అనేక కార్యక్రమాలను చేపట్టడానికి ప్రోత్సహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే యాజమాన్య పద్ధతులపై సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణను రైతులకు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను శాస్త్రవేత్తలను అడిగి వారి సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మద్దనకుంట ఎంజారప్ప, ఈరలింగ శ్రీనివాస్ రఘు, మాజీ ఎంపిటిసి చంద్రప్ప, కాంతరాజు, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి సీనియర్ నేత మాతృమూర్తి మృతి

**గుత్తి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



నారాయణ నివాళులు అర్పిస్తున్న దృశ్యం

గుత్తి మున్సిపల్ పరిధిలోని 25వ బ్లాక్ ఇన్‌చార్జ్, టిడిపి సీనియర్ నాయకులు కొనకొండ్ల సూరి మాతృమూర్తి నారాయణమ్మ ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె మృతి పట్ల టిడిపి గుత్తి ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణ, గుత్తి మాజీ సర్పంచు హుసేన్‌పీరా, తదితరులు నివాళులు అర్పించి వారి కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. అదేవిధంగా కమ్మసంఘం అధ్యక్షులు నాగరాజు, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు అంజనప్రసాద్, న్యాయవాది సోమశేఖర్, సీనియర్ జర్నలిస్టు అబ్దుల్‌సుబాన్, తదితరులు నివాళులు అర్పించారు.

## రక్తహీనత పట్ల అవగాహన సదస్సు

**గుత్తి. సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



సూపర్‌వైజర్ మాట్లాడుతున్న దృశ్యం

కిశోరబాలికలు తమ ఆరోగ్యం దృష్ట్యా రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి వివరించారు. బుధవారం చెట్నేపల్లిలో అంగన్‌వాడి కేంద్రంలో కిశోరబాలికలు, తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రక్తహీనతను నివారించేందుకు ఐరన్ మాత్రలను ఉచితంగా అందచేస్తున్నామని ఆమెతెలిపారు. పౌష్టికాహారం పట్ల ఆమె పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

**గుంతకల్లు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



విద్యార్థిని చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కలకత్తా నగరంలో మెడికల్ కళాశాల విద్యార్థిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. జాతీయ కమిటీ పిలుపు మేరకు బుధవారం స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద విద్యార్థిని చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ప్రభుత్వం ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించాలన్నారు. సుప్రీంకోర్టు ఈ కేసును సమోటగా స్వీకరించి ప్రభుత్వాన్ని హెచ్చరించి సిబిఐకి అప్పగించడంతో కళాశాల ప్రిన్సిపాల్ చేసిన అనేక ఆకృత్యాలు వెలుగు చూశాయన్నారు. మహిళల రక్షణ కోసం నిర్భయ, ఫోక్సో చట్టాలు వున్నా అత్యాచారాలు ఆగకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిందితులను శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కమిటీ సభ్యులు రఘునాథరెడ్డి, నాయకులు జిలాన్, సత్తార్, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

